క్లుప్తంగా

ప్రధాన డ్రెయిన్స్‌లో పూడిక తీత పనులు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన డ్రెయిన్స్‌లో పూడిక తీత పనులను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాల మేరకు తాడేపల్లి నగర పరిధిలోని చిన్న, పెద్ద కాలువల్లో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా నగర పరిధిలోని ప్రధాన కాలువల్లో జేసీబీలతో పూడికలు తొలగిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కాల్ సెంటర్ 7093912653, 08645295192 నంబర్లకు సమాచారాన్ని అందిస్తే ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయాలి



తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సోమవారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి యాజమాన్యంతో చర్చించి, కార్మికుల సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎం. గురవయ్య, సుభాని, ఇస్మాయిల్, రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి, సారమ్మ, ఏసుపాదం పాల్గొన్నారు.

మురళీ నాయక్ త్యాగం మరువలేనిది



దుగ్గిరాల: భారత్– పాక్ మధ్య జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన మురళీ నాయక్ త్యాగం మరువలేనిదని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు షేక్ సుభాని పేర్కొన్నారు. దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్ వద్ద సోమవారం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సుభాని మాట్లాడుతూ మురళీ నాయక్ త్యాగం అసమానమని తెలిపారు. కార్యక్రమంలో షేక్ జాన్ సైదా, షేక్ జిలాని, కాకా వెంకటేశ్వరరావు, ఏలేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు



దుగ్గిరాల: స్థానిక గంగా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు ఉదయం 6.15 గంటలకు నిత్య హోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, రాత్రి 7.45 గంటలకు ధ్వజారోహణం, స్వామి వారి ఏకాంత సేవ, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు జరిగాయి. భకులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను అర్చకుల యుగంధర్, ఈఓ ఎం.వి.శ్రీనివాసశర్మ పర్యవేక్షించారు.

వైభవంగా సుదర్శన హోమం



దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డు సమీపంలో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 9 గంటలకు సుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొన్నారు. మహిమాన్వితమైన సుదర్శన హోమాన్ని భక్తులు తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. ఏర్పాట్లను అర్చకులు సాకేత్ శర్మ, వేదాంతం రామచంద్ర, దేవస్థాన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వెజి'ట్రబుల్స్'తో అవస్థలు

- మంగళగిరి ప్రజలకు కూరగాయల మార్కెట్ కలేనా !
- రోడ్లపై తోపుడు బండ్ల పైనే వ్యాపారం
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రాజీవ్ గృహకల్ప రోడ్డు వద్ద రోడ్డుపై బండ్ల వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మంగళగిరి: రాజధాని అమరావతిలో ప్రధాన కార్పొరేషన్‌గా ఉన్న మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) రోజు రోజుకీ విస్తరిస్తుండటంతో నివాసాలతో పాటు జనాభా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌లో నివసించే ప్రజలకు నిత్యం అవసరమయ్యే కూరగాయల మార్కెట్ అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. శుభకార్యాలు, బంధువులు వస్తే కూరగాయల కోసం విజయవాడ పరుగులు పెట్టకతప్పడం లేదు.

ట్రాఫిక్ ఇబ్బందులతో మార్కెట్ తొలగింపు

నగరం నడిబొడ్డున మెయిన్ బజార్‌లో కూరగాయల మార్కెట్ ఉండేది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని మున్సిపల్ అధికారులు దాన్ని తొలగించి రాజీవ్ గృహకల్ప రోడ్డులో నిర్మించాలని నిర్ణయించారు. అక్కడ రేకుల షెడ్లు వేశారు. అక్కడ హోల్‌సేల్‌తో పాటు రిటైల్ దుకాణాలు ఉన్నా వినియోగదారులకు అందుబాటులో లేకపోవడంతో పెద్దగా విక్రయాలు జరగడం లేదు. దీంతో పలువురు రిటైల్ వ్యాపారులు రాజీవ్ గృహకల్ప రోడ్డు వద్ద కార్పొరేషన్ ప్రధాన రహదారి అనుకుని ఉన్న సర్వీసు రోడ్డుతో పాటు ప్రధాన రహదారిపై తోపుడు బండ్లపై విక్రయాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి సర్వీసు రోడ్డు కూరగాయల తోపుడు బండ్లతో నిండిపోతోంది. అది చాలక మరికొన్ని గౌతమ బుద్ధా రోడ్డుపైన పెట్టి విక్రయిస్తున్నారు. వినియోగదారులు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేసి కూరగాయలు కొనుగోలు చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కార్పొరేషన్ శివారు ఆటోనగర్ వెంట కూరగాయల బండ్లు ఉన్నా పట్టణంలోని పలు ప్రాంతాల వారికి దూరమవడంతో రాలేకపోతున్నారు. మార్కెట్ దూరం అవడం, అన్ని రకాల కూరగాయలు దొరక్కపోవడం కారణంగా అధికమంది విజయవాడ వెళ్లి కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.

ఉన్నా ఉపయోగం లేని రైతుబజార్



నిడమర్రు రోడ్డులోని రైతు బజార్

పట్టణంలోని నిడమర్రు రోడ్డులో రైతు బజార్ ఉన్నా ఉపయోగపడటం లేదు. పట్టణంలోని వినియోగదారులకు దూరంగా ఉండటం, సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో అక్కడకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. వినియోగదారులు వెళ్లినా అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉండటం లేదు. పైగా అక్కడకు వెళ్లాలంటే సమస్యగా మారడంతో పాటు ఖర్చులు అవుతున్నారు. రైతు బజార్‌కు వెళ్లాలంటే పాత బస్టాండ్ వద్ద ఆటోలు దిగి, అక్కడ నుంచి నడుచుకుంటూ వెళ్లాలి. ఆటో చార్జీలే రూ. 40 చెల్లించాల్సి రావడంతో వినియోగదారులు అటువైపు వెళ్లడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నగరంలో అందరికీ అందుబాటులో ఉండేలా కూరగాయల మార్కెట్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ ఏర్పాటుకు కృషి



నగరంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ఎలాంటి ప్రతిపాదనలు లేవు. వెంటనే మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళతాం. నగర ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా మార్కెట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– అలీంబాషా, కమిషనర్, ఎంటీఎంసీ

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



సమ్మర్ క్యాంప్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు

తాడేపల్లి రూరల్ : విద్యార్థులంతా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ రత్నఫాదర్ అన్నారు. డాన్‌బాస్కో, నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని చిగురు బాలల గ్రామంలో సోమవారం నెల రోజుల సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రత్న ఫాదర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమ్మర్ క్యాంప్‌లో బాధ్యతాయుతంగా ఉండాలని తెలిపారు. బంగారు భవిష్యత్ కోసం విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ శిబిరంలో చిన్నారులకు సైబర్ క్రైం, బాలల హక్కులు, లైఫ్ స్కిల్ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పిల్లల మానసిక వికాసం కోసం క్రాఫ్ట్, ఆర్ట్ వర్క్, ఆటలు, పాటలు, డ్రాయింగ్ కాంపిటీషన్లు నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ సిబ్బంది పాల్గొన్నారు.

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

తాడికొండ: ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం లాం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మజ్జి ప్రసాద్ (37) నూతనంగా నిర్మిస్తున్న భవనం పైకి ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఎక్కాడు. అక్కడ నుంచి జారిపడి, ప్రహరీ గోడ నిర్మాణానికి నిలబెట్టిన ఇనుప చువ్వలు గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. లాం గ్రామానికి చెందిన కొల్లికొండ జయశంకర్ ఈనెల 4న ఇంటి ముందు ద్విచక్ర వాహనం నిలిపాడు. దాన్ని రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సంఘు నాయకులు

మంగళగిరి టౌన్: గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇస్తానని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పట్టాలు ఇవ్వకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువు పోరంబోకు స్థలాల్లో ఇళ్లు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. రాజధాని ప్రాంతంలో సెంటు భూమి ఇచ్చిన పేదలకు నివాస ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆగస్టులో ఆత్మకూరు గ్రామంలో సర్వే చేసి పట్టాలు ఇస్తామని తహసీల్దార్ చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామారావు, అధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాయకులు దుర్గారావు, బాబూ వరప్రసాద్, అజయ్, శివశంకరరావు, నిర్మల పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి



పాటల పోటీల విజేతలతో అతిథులు

తెనాలి: పదకవితా పితామహుడు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు సోమవారం సాయంత్రం స్థానిక గీతామందిరంలో నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామికి, అన్నమయ్యకు అర్చన చేశారు. ఈనెల నాలుగో తేదీన నిర్వహించిన అన్నమయ్య పాటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. పాటల పోటీల్లో పాల్గొన్న 60 మంది చిన్నారుల్లో 25 మందిని, సీనియర్స్‌లో 40 మందికిగాను ఆరుగురిని ఎంపిక చేసి జ్ఞాపిక, నగదు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రముఖ జ్యోతిష్య పండితుడు రాళ్లబండి చంద్రశేఖర్, నృత్యగురువు, చల్లా యామిని, సంగీత గురువు కామిశెట్టి పావనిని సన్మానించారు. ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా వేద పండితుడు విష్ణుభట్ల యజ్ఞరామకృష్ణ పౌండరీక యాజులు, పంచాంగ రామానుజాచార్యులు, గౌరవఝుల ఆంజనేయశాస్త్రి, కృత్తివెంటి కమల, సుజాత, టీవీఎస్ శాస్త్రి, పర్చూరు సుబ్బారావు, నరసింహారావు మాట్లాడారు. కేవలం పిల్లల్లో భక్తి భావం పెంచడానికి, అన్నమయ్య సంకీర్తనల ప్రచార నిమిత్తం ఈ కార్యక్రమాలను జరుపుతున్నామని సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. కొండపి వసుంధర, అన్నమయ్య రమాదేవి, రజిని, నంబూరి వినతి, సావిత్రి,లక్కరాజు కనకదుర్గ, మాదల సత్యకుమారి, కల్యాణి, కోగంటి నాగమణి, మూర్తి అనురాధ, బాలాత్రిపుర సుందరి పాల్గొన్నారు.

18న మహా శాంతి అభిషేకం

ఫిరంగిపురం: కృష్ణశిల రూపంలో ఉన్న సింహాద్రి అప్పన్న నూతన విగ్రహానికి 18న మహాశాంతి అభిషేకం నిర్వహించనున్నట్లు కోటి లింగాల క్షేత్రం నిర్వాహకులు లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. మండలంలోని వేమవరంలో గల కోటి లింగాల క్షేత్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జ్ఞాన ప్రసూనానంద బాబా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నల్లపాడు నుంచి వెంగళాయపాలెం వెళ్లే దారిలో పుష్యాద్రి లక్ష్మీ నృసింహ ఆలయం ఎదురుగా ఉన్న మైదానంలో ఈనెల 18న ఉదయం 7 గంటల నుంచి 8 వరకు అభిషేకాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

దుగ్గిరాల: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు కోరారు. ఆయన సోమవారం మండలంలోని గొడవర్రు, పెదకొండూరు గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు మాత్రమే తెచ్చిందని తెలిపారు. వాటిని రద్దు చేసేందుకు ఈనెల 20న చేస్తున్న సమ్మెను కార్మికులు, రైతులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ రెండు గ్రామాల్లోని 40 ఎకరాల వ్యవసాయ లంక భూమికి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.విజయకుమార్, జి.రమేష్, ఎస్.బుజ్జి, ఎం.రామ్ చరణ్ పాల్గొన్నారు..

ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్ నియామకంపై హర్షం

దుగ్గిరాల: ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాదిగ సామాజిక వర్గానికి చెందిన కేఎస్. జవహర్‌కి కేటాయించడంపై కూటమి ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ ఏపీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని చిలువూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, కొవ్వూరు ఎమ్మెల్యే జవహర్‌ను కమిషన్ చైర్మన్‌గా నియమించడం వల్ల మాదిగలకు సముచిత స్థానం లభించిందని ఆయన పేర్కొన్నారు.

బైక్ చోరుల అరెస్ట్

తెనాలి రూరల్: బైక్ చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కఠెవరం గ్రామానికి చెందిన నాగసాయికృష్ణ తన పల్సర్ బైక్‌ను గత నెల 30వ తేదీ రాత్రి ఇంటి ముందు నిలిపాడు. మర్నాడు ఉదయం లేచే సరికి బైక్ కనబడకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. రూరల్ ఎస్‌ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి నిందితులను కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన అబూబకర్ బేగ్, బాలగంగాధర్ తిలక్‌లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి బైక్‌ను రికవర్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి



వైద్యాధికారులతో మంత్రి నాదెండ్ల

కొల్లిపర: కొల్లిపరలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించిన మంత్రి, ప్రభుత్వ ఆసుపత్రిని కూడా తనిఖీ చేశారు. స్థానికులు, రోగులను పలకరించి, అక్కడ అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అవుట్ పేషెంట్ల సంఖ్య మరింతగా పెరగాలని స్పష్టంచేశారు. ఆసుపత్రిలో ఈనెల 18న మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అవసరమైతే తెనాలి జిల్లా ఆసుపత్రి, గుంటూరులోని సమగ్ర వైద్యశాల నుంచి కూడా వైద్యులను పిలిపించుకోవాలని చెప్పారు. వైద్యశిబిరానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని హామీనిచ్చారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ శాంతి

ఫిరంగిపురం: వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు వేసవిలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యురాలు శాంతి సూచించారు. మండలంలోని వేమవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. 94 మందికి షుగర్, బీపీ ,థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం వృద్ధులు, గర్భిణులుకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. గర్భిణులు మంచినీటితో పాటు పండ్లరసాలు కొద్దికొద్దిగా తీసుకోవాలని సూచించారు. సిల్కు దుస్తులు కాకుండా మెత్తగా ఉండే కాటన్ వస్త్రాలు ధరించాలని చెప్పారు. చిన్నారులకు ఎండలో ఎక్కువగా తిరగకుండా చూడాలని, అవసరమైతే అప్పుడప్పుడు ఓఆర్ఎస్ ప్యాకెట్లు గ్లాసునీటిలో కలిపి తాగించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అంగన్వాడీ కేంద్రాలు, చలివేంద్రాలు, హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండవల్లిలో పారిశుద్ధ్య కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తాడేపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో మున్సిపల్ కార్మికులు విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం. రవి మాట్లాడుతూ మే 20న జరిగే కార్మిక సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే వేతనాల చెల్లింపు, కనీస వేతనాలు, బోనస్ చెల్లింపు, సమాన పనికి సమాన వేతన చట్టాలు రద్దు అవుతాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం, 17 అంశాల చార్టర్ అండ్ డిమాండ్ల సాధన కోసం మే 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు స్వర్ణకుమారి, కె. మరియమ్మ, శాంతకుమారి, జయలక్ష్మి, సుజాత, ఉషారాణి, సునీత పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కృష్ణ

తాడేపల్లి రూరల్: కనీస వేతన చట్ట ప్రకారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ తాడేపల్లి మండల నేత పల్లె కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో సోమవారం ఆయన పారిశుద్ధ్య కార్మికులను కలసి మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు, కర్షకులకు వ్యతిరేకంగా అనేక చట్టాలు చేస్తోందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చారని మండిపడ్డారు. భవన నిర్మాణ, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా అన్ని ట్రేడ్ యూనియన్లు సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వెంకన్న, వెంకటేశ్వర్లు, రమేష్, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య పాల్గొన్నారు.

సేవామూర్తులు నర్సులు



సత్కారం అందుకున్న నర్సులతో డాక్టర్ అనూష

మంగళగిరి టౌన్: నర్సులు సేవా మూర్తులని ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పి. అనూష అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్‌లోని స్టాఫ్ నర్స్, ఏఎన్ఎంలను శాలువాలతో సత్కరించి, పూలమొక్కలు అందజేశారు. అనంతరం డాక్టర్ అనూష మాట్లాడుతూ డాక్టర్ ప్రాణాన్ని నిలబెడితే, నర్సు సేవలతో రోగికి ధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. ప్రపంచంలో నర్సింగ్ వృత్తిని చేపట్టిన మొట్టమొదటి మహిళ ఫ్లోరెన్స్ నైటింగేల్ అని తెలిపారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని నర్సులు రోగులందరినీ సమానంగా చూడాలని, వారికి మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు వరలక్ష్మి, ఏఎన్ఎంలు ఝాన్సీ, విజయ, సుజాత, విజయలక్ష్మి, కవిత, జ్యోతి, సరిత, ఆదిలక్ష్మి, హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగల అభ్యున్నతికి లెదర్ పార్కుల నిర్మాణం చేపట్టాలి



బుల్లా రాజారావును సత్కరిస్తున్న ఏపీ చర్మకార సేవా సంఘం నాయకులు

మంగళగిరి టౌన్: మాదిగల అభ్యున్నతికి ప్రభుత్వం చొరవ తీసుకుని లెదర్ పార్కుల నిర్మాణం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు కోరారు. చర్మకారుల సమస్యలపై రాష్ట్రంలో నాలుగు విడతలుగా పర్యటన ముగించుకున్న ఆయన్ను సోమవారం తెనాలి రోడ్డులో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద స్థానిక చర్మకార నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ నుంచి రాష్ట్రంలో నాలుగు విడతలుగా పర్యటించానని, ప్రభుత్వం లెదర్ పార్కులకు కేటాయించిన భూమికి సంబంధించిన వివరాలతో వినతి పత్రాలను ఆయా జిల్లా కలెక్టర్లకు, త్రులకు, ఎంపీలకు ఇచ్చినట్లు తెలిపారు. లెదర్ పార్కులకు కేటాయించి, నిర్మాణం జరపని భూములను గుర్తించి,వాటి వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అంజేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 19 జిల్లాలో లెదర్ పార్కులు నిర్మించడానికి ప్రభుత్వం కేటాయించిన 742 ఎకరాల భూమి సిద్ధంగా ఉందని తెలిపారు. నిర్మాణం చేపట్టడం వల్ల వేలాది మంది మాదిగ నిరుద్యోగ యువతీ, యువకులకు జీవనోపాధి కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ చర్మకార సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆంజనేయులు, ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, నాయకులు సుబ్బారావు, రవికుమార్, ప్రకాష్, రాజు, ఖాసిం పాల్గొన్నారు.

ప్రేక్షకులను ఆకట్టుకున్న చింతామణి నాటకం



తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని రాజుల కాలనీలో నిర్వహిస్తున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా ప్రదర్శిస్తున్న సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం రాత్రి ప్రదర్శించిన చింతామణి పౌరాణిక నాటకం (భవానీ శంకరుని సీను) ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. భవానీ శంకరుడిగా తాడిబోయిన నాగేశ్వరరావు, చింతామణిగా రమణాంజలి నటించి ప్రేక్షకులను మెప్పించారు. తాడిబోయిన నాగేశ్వరరావు ఆలపించిన పద్యాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం వేషధారులను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గంపల శివనాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, పూసపాటి కొండంరాజు, అశోక్ గజపతిరాజు, వెంకటేశ్వరరాజు, నారాయణరాజు తదితరులు ఉన్నారు.